
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

సోమవారం 1 డిసెంబరు 2025

వైవీయూ డిగ్రీ, పీజీ పరీక్షలు వాయిదా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలు వాయిదా వేసినట్లు వైవీయూ పరీక్ష నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు వెల్లడించారు. విశ్వవిద్యాలయ అధికారుల ఆదేశాల మేరకు దిత్వా తుఫాన్ కారణంగా వాయిదా వేశామని, ఈ పరీక్ష తేదీని ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు. విద్యార్థులు, కళాశాలల ప్రిన్సిపల్‌లు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్ రద్దు: ఎస్పీ

కడపక్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాన్ నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం వున్నందున జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాధ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి ఫిర్యాదుల పరిష్కారానికి రావద్దని వారు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం.ఏపీ.గౌ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్‌లోనూ రద్దు : డీఆర్వో


కడప కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున డిసెంబరు 1న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి రావద్దని తెలిపారు. ఒక వేళ అర్జీలు సమర్పించాలనుకొనే బాధితులు మీకోసం ఎపి.జివివోఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని డీఆర్వో ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు

● డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా స్టడీ క్లాసుల పేరుతో, అదనపు తరగతుల పేరుతో పాఠశాల నిర్వహిస్తే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు వారిపిల్లలను ఇంటి వద్ద సురక్షితంగా ఉంచి, బయటకు పంపకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

గండికోటలో రాక్‌క్లైంబింగ్


7

ఈ నెల మూడో వారంలో

చంద్రబాబు రాక

● పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

వేంపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు డిసెంబరు 3వ వారంలో పులివెందులకు రానున్నారని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. ఆదివారం వేంపల్లెలో పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన సమావే శంలోనూ, విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. పులివెందులకు రానున్న చంద్రబాబు దృష్టికి తాగు, సాగునీటి సమస్య తీసుకెళ్తామని, జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వ నుంచి చివరి ప్రాంతమైన చక్రాయపేట, వేంపల్లెకు నీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని కోరనున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం, వైఎస్ ప్రభుత్వం పక్కనపెట్టిన సూక్ష్మనీటి సేద్యం పథకాన్ని అమలు చేయించేందుకు రూ.2500 కోట్లు అవసరమని, సీఎంతో ఆ బృహత్తర పథకాన్ని చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈసారి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచు నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులన్నీ వందశాతం టీడీపీ కార్యకర్తలకు వచ్చేలా చేయడమే లక్ష్యమన్నారు.

వలంటీర్లా... మజాకా



● 53,333 రైస్‌కార్డుల అడ్రస్‌లు గల్లంతు
● ఫ్యాన్సీ సెల్ నెంబర్లతో టోకరా
● గత ప్రభుత్వంలో పథకాలకు భారీగా ఎసరు
● స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీలో వెలుగులోకి



కడప కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 1234567890, 9999999999 ఈ నెంబర్లు విద్యాసంస్థల్లో విద్యార్థులు సాధించిన ర్యాంకుల పంట అనుకుంటే పప్పులో కాలేసినట్లే. జగన్ సర్కారు నమ్మకంగా ఏర్పాటు చేసుకున్న అనధికార సైన్యం. అదేనండీ మన గ్రామ వలంటీర్లు గత ప్రభుత్వ హయాంలో రైస్‌కార్డుల మంజూరుకు ఇలాంటి ఫ్యాన్సీ సెల్ నెంబర్లతో వేలాది రైస్‌కార్డులు అనర్హులకు కట్టబెట్టారు. పదో, పరకో ఆశ పడ్డారో... లేక ఆ పార్టీ చోటా, మోటా నేతలకు గులాంగిరీ చేశారో కానీ పేదల పథకాలు పక్కదారి పట్టించారు. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇలాంటి అక్రమాలను ఆరాతీసే పనిలో పడింది. జగన్ బొమ్మతో తెల్లరేషన్‌కార్డు స్థానంలో ఏటీఎం తరహాలో ఉండే ఆధునిక సాంకేతికతలతో కూడిన స్మార్ట్ రైస్‌కార్డులను రూపొందించింది. జిల్లాలో గత రెండు నెలల నుంచి 5,73,675 స్మార్ట్‌కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేపట్టింది. అయితే అందులో 53,333 స్మార్ట్‌కార్డుల అడ్రస్సులు గల్లంతయ్యాయి. వలంటీర్లు నమోదు చేసిన ఫ్యాన్సీ సెల్‌నెంబర్లు పనిచేయకపోవడంతో అధికార యంత్రాంగం, డీలర్లు లబ్ధిదారుల కోసం జల్లెడ పట్టారు. నెలాఖరు నాటికి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆ కార్డులను తిప్పి పౌరసరఫరాల శాఖకు పంపనున్నారు. నమ్మకంగా ఏర్పాటు చేసుకున్న వలంటీర్ల వ్యవస్థ నయా వంచనతో వైసీపీ పాలనలో పథకాల పందేరం వెరసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందనే అపవాదు మూటగట్టుకుందంటారు.

వేలల్లో స్మార్ట్‌కార్డుల పెండింగ్



30 ఏళ్ల పాలనంటూ ఆశల పల్లకీలో వైసీపీ పెద్దలు ఊరేగారు. రాష్ట్రంలో అప్పుల కుప్పలు పెరిగినా లెక్క చేయలేదు. నవరత్నాలు అంటూ వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగ పింఛన్లు, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఆరోగ్యశ్రీ లాంటి అనేక ఉచిత పథకాలకు బటన్ నొక్కుడుకు దిగారు. ఊరికే వచ్చే ఉచిత పథకాల కోసం అనర్హులు రేషన్‌కార్డుల కోసం పోటీ పడ్డారు. డిగ్రీలు, పీజీలు చదివి చాలీచాలని రూ.5 వేల గౌరవ వేతనంతో అసంతృప్తిగా ఉన్న వలంటీర్లకు ఉచిత పథకాల పందేరం కలిసొచ్చింది. ఇంకేముందీ జవాబుదారీతనాన్ని పక్కన పెట్టి పేద, ధనిక తేడాలు, కువైత్, ఇతర దేశాలు, రాష్ట్రాల్లో ఉండే అనర్హులకు పేదల రైస్‌కార్డులను కట్ట బెట్టేందుకు అడ్డదారులు తొక్కారంటారు. వైసీపీ సర్కారులో గ్రామ, వార్డు సభ్యుల నుంచి ఎమ్మెల్యేల వరకు నిజమైన అర్హులను గుర్తించాల్సిందే. కానీ పెత్తనమంతా వలంటీర్లదే అన్నట్లు రాజకీయం సాగింది. దీంతో కొందరు వలంటీర్లు ఉచిత పథకాలను పెద్దలకు కట్టబెట్టేందుకు కంకణం కట్టుకొని రైస్‌కార్డుల మంజూరులో చేతివాటం చూపారనేందుకు స్మార్ట్‌కార్డుల పంపిణీలో బట్టబయలైంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు ఐదేళ్ల పాలనలో జిల్లాలో కోట్లాది రూపాయలను పేదల మాటున పెద్దలు బొక్కారా ? అనే సందేహాలకు ఊతమిస్తోంది. హంగు, ఆర్భాటాలు, ఆర్థిక, స్థితిగతులున్న ధనిక వర్గాలకు చెందిన వారు ఉచిత పథకాలకు అర్రులు చాచడం వైసీపీ అవినీతికి నిదర్శనమంటున్నారు. అయితే ఈ విషయం తాజాగా కూటమి సర్కారు చేపట్టిన స్మార్ట్‌కార్డుల పంపిణీలో పౌరసరఫరాల శాఖతో పాటు డీలర్లు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ యంత్రాంగం జల్లెడ పట్టి వెతికినా 53,333 స్మార్ట్ రైస్‌కార్డుల ఆచూకీ సవాలుగా మారిందంటారు.

వలస దారులేరీ ?

జిల్లాలో 5,73,675 రైస్‌కార్డుల పంపిణీకి గ్రామ స్థాయిలో ఉండే సచివాలయ సిబ్బందికి బాధ్యత అప్పగించారు. వారు గ్రామ స్థాయిలో ఇళ్లిళ్లూ జల్లెడ పట్టి, కూటమి సర్కారు ప్రతినిధులతో కలిసి దాదాపు 3,64,552 స్మార్ట్ రైస్‌కార్డులను పంపిణీ చేశారు. అయితే కొందరు ఇతర ప్రాంతాలకు, చనిపోయిన వారు, వలసలు, బాడుగ ఇళ్లల్లో ఉండీ వేరే ప్రాంతాల్లో నివాసాలు ఉండడం లాంటి కారణాల వల్ల స్మార్ట్ రైస్‌కార్డులు పొందలేదు. కానీ ఈ నెల 30వ తేది వరకు స్మార్ట్ కార్డుదారులకు జాయింట్ కలెక్టర్ గడువు విధించారు. ఈ ప్రకటన వెలువడిన నాటి నుంచి మిగిలిన 53 వేల స్మార్ట్‌కార్డుల కోసం లబ్ధిదారులు రాలేదంటున్నారు. చౌకదుకాణ డీలర్లు కూడా లబ్ధిదారులను గుర్తించి 155790 స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేశారు. మొత్తం కలిపి 5,20,342 రైస్‌కార్డులు పంపిణీ చేయగలిగారే కానీ జల్లెడ పట్టి వెతికినా వలసదారుల జాడ దొరకడం లేదంటున్నారు.

లక్షల విలువ చేసే ఫ్యాన్సీ నెంబర్లు

పేదరికానికి దిగువనున్న పేదలకు రెక్కాడితే కానీ డొక్కాడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించేందుకు రేషన్ కార్డు ప్రామాణికంగా చేసింది. ఇంతటి పేదలకు వైసీపీ పాలనలో ఇచ్చే కొత్త రేషన్‌కార్డుల నమోదులో మార్కెట్‌లో లక్షలాది రూపాయల డిమాండ్ ఉన్న 9999999999, 8888888888 లాంటి ఫ్యాన్సీ నెంబర్లు పేదల సెల్‌ఫోన్ నెంబర్లుగా ఉండడాన్ని అధికారులు, సిబ్బంది ఆశ్చర్యపోతున్నారు. ఇంతటి ఖరీదైన ఫ్యాన్సీ సెల్‌నెంబరు వాడే వారు పేదలెందుకవుతారని, వీరికి ఉచిత పథకాలు అవసరమా? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అడిగే వారెవరూ లేకపోవడంతో వలంటీర్లు ఈ ఫ్యాన్సీ నెంబర్లను లింక్ చేశారు. ఆ నెంబర్లకు ఇప్పుడు డీలర్లు, సచివాలయ సిబ్బంది రింగ్ చేస్తే స్పందన లేదంటారు. వలంటీర్ల వింత పోకడల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి అడ్రస్సులు లేని కార్డులను పట్టుకొని ప్రతిపక్ష నేతలు పథకాల్లో కోతలు విధిస్తున్నారంటూ గగ్గోలు పెడుతుండడం గమనార్హం.

నేడు డయల్ యువర్

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



శివశంకర్ లోతేటి

కడప, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరు శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నెంబరు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

దిత్వా తుఫాను కారణంగా ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని 9 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి సూచించారు. భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ లైన్లు తెగిపోవడం, స్తంభాలు కూలిపోవడం లాంటి సంఘటనలు జరిగినట్లయితే వెంటనే తమ సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు కానీ సిబ్బందికి కానీ సమాచారం అందించాలని వినియోగదారులకు సూచించారు. విద్యుత్‌శాఖ టోల్‌ఫ్రీ నెం.1912 లేదా 1800425 155333కు కాల్ చేసి సమాచారం అందివ్వాలని తెలిపారు.

నేటి నుంచి రబీ పంటల బీమా నమోదు

● డిసెంబరు 15 వరకు గడువు



కడప రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రబీ 2025-26 పంటల బీమా నమోదు కార్యక్రమాన్ని డిసెంబరు 1 నుంచి చేపట్టనున్నామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీమా పరిధిలోకి 8 రకాల పంటలను తీసుకొచ్చి ఏఏ పంటకు ఎంత ప్రీమియం చెల్లించాలో నిర్ణయించామని తెలిపారు. నువ్వుల పంటకు రూ.180, వేరుశనగ పంటకు రూ.480, పెసరకు రూ.270, జొన్నపంటకు రూ.315, మినుముకు రూ.285, వరికి రూ.630, పొద్దుతిరుగుడుకు రూ.300, బుడ్డశనగకు 480 ఒక ఎకరానికి ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. రైతులు వారి సమీపంలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్‌లో వారి ఆధార్, భూమి, కౌలుకార్డు, పంటవేసిన పత్రాన్ని బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందని, పైన తెలిపిన పంటలకు బీమా చేసుకునేందుకు చివరి తేది డిసెంబరు 15 వరకు మాత్రమే కేటాయించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

● వారంరోజుల పాటు బీమా వారోత్సవాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రబీ 2025-26 పంటల బీమా వారోత్సవాలను వారం రోజుల పాటు డిసెంబరు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాల్లో ఆయా బ్యాంకులు, బీమా కంపెనీలు, సీఎస్‌సీలు, వ్యవసాయ ఫీల్డ్ ఫంక్షనరీలు తదితరులు ప్రచారం నిర్వహించనున్నారు. వారోత్సవాల ద్వారా 100 శాతం మంది రైతులకు పంటల బీమా పైన విస్తృతమైన అవగాహన కల్పించనున్నట్లు చంద్రానాయక్ తెలిపారు.

అరటి పంట భారమై...

● ధర లేక పంటను నేలమట్టం చేస్తున్న రైతన్నలు



కూనవారిపల్లెలో అరటి పంటను తొలగిస్తున్న రైతు సుబ్బారెడ్డి

ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి అరటి పంటను పండించిన రైతన్నలు ధరలేక కళ్ల ముందే పంటను నేలపాలు చేస్తున్న ఘటన ఖాజీపేటలో ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని కూనవారిపల్లె, కొత్తపేట, నాగసానిపల్లె, తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాలకు పైగా అరటి పంటను రైతులు సాగు చేశారు. తొలి పంట మాత్రం లాభాలు చేకూరినా, రెండవ పంట ఆశాజనకంగా ఉండినా, ప్రస్తుత పంట మాత్రం వ్యాపారస్థులు లేకపోవడంతో తోటల్లోనే పండ్లు మాగాయి. రైతులు ఎన్నో విధాలుగా కటింగ్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో దుఃఖాన్ని దిగమింగి కళ్ల ముందే పంటను యంత్రాలతో నేలపాలు చేయడం చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. దిగుబడి బాగుంది.. నాలుగు రూపాయలు వస్తాయనుకున్న రైతుల ఆశలు ఆవిరవడంతో లబోదిబోమంటున్నారు.

ఎదురుచూపులే మిగిలాయి

ఏడు ఎకరాల్లో అరటి పంట సాగు చేస్తే మొదటి కటింగ్ పూర్తిగా విక్రయించాను. రెండవ కోత మాత్రం ఒక్క కాయ కోయలేదు. రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

- ఆర్.రాజశేఖర్‌రెడ్డి, కూనవారిపల్లె

అప్పుల ఊబిలో కూరుకుపోయాం

ఏడు ఎకరాల్లో అరటి పంట సాగు చేసి రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టాను. దళారులు లేక తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. కాయలు కొట్టేవారు లేక ఎదురుచూశాము. ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదు.

- సుబ్బారెడ్డి, కూనవారిపల్లె

అన్నదాతల్లో తుఫాను దడ

● జిల్లా వ్యాప్తంగా 125.6 మి.మీ. వర్షపాతం
● నేడు అధిక వర్షపాతం నమోదుకు అవకాశం
● వరి, బుడ్డశనగ, మినుముకు పొంచివున్న ప్రమాదం
● గత తుఫానుల కారణంగా రూ.659 లక్షల పంటనష్టం



కడపరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అన్నదాతల్లో దిత్వా తుఫాను దడ మొదలైంది. ప్రధానంగా గత ఖరీఫ్‌లో వరి పంట సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కోత దశలో 20 వేల హెక్టార్లలో వరిపంట ఉంది. ఈ పంటపై తుఫాను ఎక్కడ విరుచుకుపడుతుందోనని గగ్గోలు పెడుతున్నారు. గతంలో తుఫానులు, అధిక వర్షాల కారణంగా రూ.659 లక్షల మేర 2123.43 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన అధిక వర్షాలకు 179.41 హెక్టార్లలో రూ.44.63 లక్షల మేర పంటలు దెబ్బతినగా, ముంథా తుఫాను కారణంగా రూ.480 లక్షల మేర 1944.02 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వీటిలో 90 శాతం మేర వరిపంట దెబ్బతింది. ఈ గాయం మానకముందే ఇప్పుడు మళ్లీ దిత్వా తుఫాను జిల్లా రైతాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తాజాగా ఆదివారం సాయంత్రం వరకు జిల్లా అంతటా 125.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇందులో కడప డివిజన్‌లో 71.2, బద్వేల్ డివిజన్‌లో 35.4, జమ్మలమడుగు డివిజన్‌లో 11.4, పులివెందుల డివిజన్‌లో 7.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా ఒంటిమిట్ట మండలంలో అత్యధికంగా 25.8, ఖాజీపేటలో అత్యల్పంగా 0.6 ఎంఎం వర్షపాతం నమోదైంది.

అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

సోమవారం జిల్లా వ్యాప్తంగా అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు డిసెంబరు 1న సెలవును ప్రకటించారు. అలాగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని కూడా రద్దు చేశారు. అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో రైతులను, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని సూచించింది. ప్రమాద ప్రదేశాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో అధికారులను నియమించాలని పేర్కొంది.

నిండుకుండలా ప్రాజెక్టులు

గత ముంథా తుఫాను కారణంగా జిల్లాలోని ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీరు వచ్చిచేరింది. వీటి నుంచి చెరువులకు నీరు రావడంతో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా దిత్వా తుఫాను కారణంగా సోమవారం నుంచి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉండడంతో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.

బుడ్డశనగ, మినుములకు పొంచివున్న ప్రమాదం

జిల్లాలో 2025 రబీలో వర్షాధారం పంట కింద నల్లరేగడి భూముల్లో పెద్దఎత్తున బుడ్డశనగ, మినుము పంటను రైతులు సాగుచేశారు. ప్రస్తుతం పంట మొక్కదశలో ఉంది. గత ముంథా తుఫాను కారణంగా భూమిలో తేమశాతం అధికమైంది. ఈ తేమశాతం ఆరకముందే ప్రస్తుతం మరో తుఫాను కారణంగా జిల్లాలో ఆదివారం తెల్లవారుజాము నుంచి వర్షాలు పడుతుండడంతో పంటలో తేమశాతం అధికమై మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం దాపురించడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పుష్పగిరిలో
బ్రహ్మసూత్ర
శివలింగాలు
7

వైభవంగా లక్షార్చన మహోత్సవం

● పెన్నాతీరంలో అయ్యప్పస్వామి శరణుఘోష




లక్షార్చన నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెన్నాతీరంలోని అయ్యప్పస్వామి గుడిలో ఆదివారం లక్షార్చన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం వేద పండితులు గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, వెంకటేశ్వర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలో గణపతి, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆశీనులను చేశారు. మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్షార్చన నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, భస్మం, పూజాద్రవ్యాలతో స్వామివారిని లక్ష సార్లు అర్చించి శరణు వేడారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి లక్షార్చనలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 30 వేల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ నిర్వాహకులు, వలంటీర్లు, అయ్యప్పస్వామి, అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి సతీష్, కోశాధికారి వినోద్‌కుమార్, టీటీడీ మాజీ సభ్యుడు మారుతీప్రసాద్, వాసు, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 26.3 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.324 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

గండికోటలో రాక్‌క్లైంబింగ్



జమ్మలమడుగు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన విద్యార్థులకు రాక్ క్లైంబింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ గండికోట ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఆదివారం మూడవ రోజుకు చేరుకుంది. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు వంద మందికిపైగా విద్యార్థులు అడ్వెంచర్ రంగంలో అవసరమైన నైపుణ్యాలను నేర్చుకున్నారు. దీంతో యువతలో శారీరక దృఢత్వం, నైపుణ్యం కలిగి ఉంటారని నిర్వాహకులు తెలిపారు.

సదరం సర్టిఫికెట్లలో తప్పులను సవరించాలి



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లలో తప్పులను సవరించడానికి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులు రాయల్‌కౌంటీలో ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ దివ్యాంగులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సదరం సర్టిఫికెట్ రీవెరిఫికేషన్‌లో అనేక తప్పులు దొర్లాయని, అలాగే పోలియోతో రెండుకాళ్లు చచ్చుబడిన దివ్యాంగులకు పర్సంటేజీని తగ్గించారన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీసీహెచ్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని, దివ్యాంగులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

పెద్దముడియం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని కలిచెర్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో వెంకటనరసయ్య తెలిపారు. ఆదివారం ఎన్‌వోపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లో భాగంగా మత్తు పదార్థాలు, సైబర్ మోసాలు, పరిసరాల పరిశుభ్రతపై ఆ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఎన్‌వోపల్లి పాఠశాల అవరణంలో మొక్కలు నాటడానికి గుంతలు తవ్వారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే సీమ వెనుకబాటు

- శిలాఫలకాలు, హామీలకే పరిమితమైన కడప ఉక్కుపరిశ్రమ
- మధ్యలోనే ఆగిన కడప-బెంగళూరు రైల్వేలైన్
- ఉద్యమానికి సన్నద్ధం కాకపోతే అధోగతే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు పార్టీలు, ప్రజాసంఘాల నేతలు



సంఘీభావం తెలుపుతున్న పలు పార్టీల, ప్రజాసంఘాల నేతలు

కడప మారుతీనగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా రాయలసీమకు చెందిన నాయకులు పాలన చేసినప్పటికీ సీమ వెనుకబాటుకు గురైందని పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఆర్‌ఎస్‌ఎఫ్) రాయలసీమ ప్రాంతీయ కమిటీ సారథ్యంలో ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కడప ఉక్కు పరిశ్రమ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, కడప-బెంగుళూరు రైల్వేలైన్ అంశాలపై ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు అవ్వారు మల్లికార్జున (జేసీఐ), సత్తార్ కె.లక్ష్మయ్య(కాంగ్రెస్), రామ్మోహన్(సీపీఎం), వెంకటశివ(సీపీఐ), సంగటి మనోహర్(ఎంఆర్‌పీ), సగిలి గుర్రప్ప(బీఎస్‌పీ), ప్రతాప్‌రెడ్డి(జనతాదళ్), సలావుద్దీన్(ముస్లిం సమైక్యవేదిక), ప్రసాద్ (ఆర్‌సీపీ), శ్రీనివాసులు(ఆమ్‌ఆద్మీపార్టీ), దేవర శ్రీకృష్ణ(లోక్‌సత్తా), అంకన్న(పీడీఎస్‌యూ) తదితరులు మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం దశాబ్దానికి పైగా ఈ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాలు ఉద్యమాలు చేస్తున్నారని, ప్రభుత్వాలు హామీలిస్తూ శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప ఉక్కు పరిశ్రమ నిర్మాణంలో ముందడుగు పడలేదన్నారు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తున్నాయన్నారు. కర్నూల్, కడప, అనంతపురం జిల్లాలకు మధ్యలో ఉన్న జమ్మలమడుగు వద్ద నిర్మించ తలపెట్టిన ఉక్కుపరిశ్రమ పూర్తయితేనే రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్, ఐటీఐ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, గల్ఫ్, తదితర ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప-బెంగుళూరు రైల్వేలైన్‌కు పది సంవత్సరాల క్రితమే నిధుల కేటాయింపు, భూసేకరణ చేశాయని, ఇందుకు ఆనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం కూడా తెలిపాయన్నారు. ఆ మేరకు కడప, రాయచోటి, మదనపల్లె మీదుగా బెంగుళూరుకు అన్ని రకాలుగా ప్రణాళికలు కూడా పూర్తయ్యాయన్నారు. కానీ సహజంగా సీమ ప్రాంతంపై ఉన్న పాలకుల నిర్లక్ష్యం కారణంగా అది కూడా మధ్యలోనే ఆగిపోయిందన్నారు. కేవలం కడప నుండి పెండ్లిమర్రి వరకు మాత్రమే రైల్వేట్రాక్ పూర్తయి కడప నుండి నంద్యాల వరకు డెమో రైలు వస్తోందన్నారు. ఏదిఏమైనా కడప-బెంగుళూరు రైల్వే లైన్ పూర్తయితే ఈ ప్రాంతం ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. కాగా కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకర ణకు పూనుకోవడం వలన ఈ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలాగా మారుతుందన్నారు. పైపెచ్చు వైద్యం కూడా పేదలకు కష్టం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పలు పార్టీలు, ప్రజా సంఘాలతో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, మహిళానాయకురాలు భాగ్యలక్ష్మీ (సీపీఐ), బాబు (ఎన్‌ఎస్‌యూఐ), పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో చిత్తూరు, కృష్ణా జిల్లాల విజయం



విజేత జట్లతో నిర్వాహకులు, అధికారులు

కలికిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కలికిరిలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో చిత్తూరు, బాలికల విభాగంలో కృష్ణా జిల్లాల జట్లు విజేతలుగా నిలిచాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో విశాఖపట్నం బాలుర జట్టుతో తలపడిన చిత్తూరు జట్టు 9-4 గోల్స్ తేడాతో భారీ విజయం చేజిక్కించుకుంది. ప్రకాశం జిల్లా జట్టుతో తలపడిన కృష్ణా బాలికల జట్టు 6-3 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. ముఖ్య అతిథిగా హాజరైన కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా రాష్ట్రంలోని 13ఉమ్మడి జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్న ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. మూడు రోజులపాటు జరిగిన పోటీలకు హాజరైన దాదాపు 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, పీడీలకు వసతి, భోజన సౌకర్యం కల్పించిన యోగేష్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, క్రీడా పోటీల రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వరరావు, కలికిరి పీడీ రెడ్డివరప్రసాద్, పరిసర ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భారతీయుల ఐక్యత కోసమే హిందూ సమ్మేళన సభ

- అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి



హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న పీఠాధిపతి విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతీయులంతా ఐకమత్యంగా ఉండాలన్నదే హిందూ సమ్మేళన సభ లక్ష్యమని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. ఆదివారం బ్రహ్మంగారిమఠంలో రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ మండల అధ్యక్షుడు అయ్యప్ప సురేశ్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పీఠాధిపతి విరజానందస్వామి, జగన్మాత ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీర శివకుమారస్వామి, రాష్ట్ర స్వయం సేవక్ సంఘం నాయకులు సుధాకర్, రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులంతా ఒక తాటిపైకి వచ్చి కలిసి మెలిసి ఉండడానికే హిందూ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్నారులు నిర్వహించిన నృత్యగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రాజకీయనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6న మల్లయ్యకొండ పనులకు బహిరంగ వేలం

- 3వ తేదీన హుండీ లెక్కింపు

తంబళ్లపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి దేవస్థానంలో వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మునిరాజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాలు సేకరించుకునే హక్కు(ధరావత్తు రూ.1లక్ష), వాహనాల టోల్ గేట్ వసూలు హక్కు(ధరావత్తు రూ.1లక్ష), గౌరమ్మ ఆలయం, ఏనుగు మల్లమ్మ ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయించుకునేందుకు (ధరావత్తు రూ.50వేలు), వీరన్న గెవి వద్ద(ధరావత్తు రూ.10 వేలు), దేవస్థానం వద్ద కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు, కొండ పైన దుకాణాలకు గేటు వసూలు హక్కుకు (ధరావత్తు రూ.50వేలు), చెప్పులు పొగు చేసుకునే హక్కు(2026 ఫిబ్రవరి 14, 15, 16 మూడు రోజులు మాత్రమే, ధరావత్తు రూ.10వేలు)లకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో హక్కు దక్కించుకుని దేవస్థానానికి బకాయి ఉన్న వారు వేలంలో పాల్గొనడానికి అనర్హులన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, సూచించిన ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఈనెల 3వ తేదీన బుధవారం మల్లయ్యకొండ దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని భక్తులు, కూటమి నేతలు హాజరు కావాలని ఈవో కోరారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం : సీఐ

అట్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థల వివాదం కేసులో ఇరువర్గాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బద్వేలు రూరల్ సీఐ కృష్ణయ్య వెల్లడించారు. నవంబరు 24న స్థల వివాదంపై రెడ్డిపల్లె గ్రామానికి చెందిన అంజనేయులు, అయ్యప్పస్వామి ఆలయనిర్వాహకుడు మాలే నరసింహారెడ్డి ఇరువురు ఘర్షణపడ్డారు. ఇద్దరికీ గాయాలు కావడంతో అట్లూరు ఎస్‌ఐ రామక్రిష్ణ ఇరువురిపై కేసులు నమోదు చేశారు. కానీ అయ్యప్ప భక్తుడైన నరసింహారెడ్డికి తలకు దెబ్బతగలడంతో ఆయనకు మద్దతుగా ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ఆదివారం అట్లూరు క్రాస్ రోడ్డుపై అయ్యప్ప స్వాములు బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో గోపవరం ఎస్‌ఐ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దారు శిరీషా, ఆర్‌ఐ రమణ, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

కలికిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేయడానికి నేతలు కృషి చేయాలని ఏఐసీసీ, ఏపీసీసీ పరిశీలకులు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి సంస్థాగతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పీలేరు నియోజకవర్గంలో సంస్థాగత నిర్మాణ కార్యక్రమానికి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు కె.మహేంద్రన్, ఏపీసీసీ పరిశీలకుడు జంగా గౌతమ్, టీసీసీ రాష్ట్ర కార్యదర్శి రాకేష్ పార్టీని పునర్నిర్మాణానికి తీసుకోవలసిన చర్యల గురించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్ రెడ్డి ఇప్పటికే పార్టీని సంస్థాగతంగా పటిష్టపరచడానికి తీసుకున్న చర్యలు గురించి వివరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవాలని పరిశీలకులు సూచించారు. జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని పునర్నిర్మించాల్సి వుందన్నారు. మొదట కాంగ్రెస్ నేతలు నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు అనుబంధ ఆస్పత్రులు పూర్తిగా ప్రభుత్వాధీనంలో ఉంటాయని, దీంతో ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్యం అందుతుందని బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం సొసైటీ కాలనీలోని తన స్వగృహంలో నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో పూర్తిగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మదనపల్లె వైద్య కళాశాల మీద ప్రత్యేక దృష్టి నిలిపారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మెడికల్ ప్రాక్టీషనర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అజ్మతుల్లాఖాన్, విజయ భారతి అధినేత డాక్టర్ ఎన్. సేతు, బర్నేపల్లె రవికుమార్, ఆకుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

పీలేరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ఆరోపించారు. ఆదివారం పీలేరులో యూటీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని నమ్మి ప్రభుత్వ ఏర్పాటుకు ఎంతో శ్రమించామని, తీరా అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చడంలో తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరించిందని, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా తీవ్ర వేధింపులకు గురి చేసిందన్నారు. రివర్స్ పీఆర్‌సీతో ఉద్యోగులను జగన్ ప్రభుత్వం దగాచేసిందని విమర్శించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. 25 ఏళ్లకు పైగా బోధనలో అనుభవం ఉన్న వారిని ఇప్పుడు టెట్ రాయమనడం సహేతుకం కాదన్నారు. సమావేశంలో రాధాక్రిష్ణ, చంద్రశేఖర్, అక్రంబాషా, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యంపై వైసీపీ నాయకులు మాట్లాడడమా..!

- ఈసారి అన్ని పదవులూ టీడీపీకే
- మైనార్టీలు చేరడం శుభసూచకం
- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



బీటెక్ రవి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మైనార్టీ నాయకులు

వేంపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందంటూ స్థానిక వైసీపీ నేత మాట్లాడడం విడ్డూరంగా ఉందని, వైఎస్ కుటుంబం గత ఎన్నికల్లో రిగ్గింగ్‌కు, అరాచకానికి పాల్పడి, టీడీపీ కార్యకర్తలపై దాడి చేసింది గుర్తులేదా అంటూ పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలని చూడడం, స్థానిక ఎన్నికల్లో అక్రమంగా ఏకగ్రీవాలు చేసుకోవడం మరచిపోయారా అని సూటిగా ప్రశ్నించారు. అన్ని పదవులు ఎప్పుడూ మీకే కావాలా, ముప్పైనలభై ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం, సర్పంచు నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ అన్ని పదవులు టీడీపీ కార్యకర్తలకు దక్కించుకోవడమే ఏకైక లక్ష్యమని, అందుకోసం దేనికైనా సిద్ధంగా ఉన్నామని బీటెక్ రవి ప్రకటించారు. వేంపల్లె పట్టణంలో వైసీపీ మైనార్టీ నాయకులు మొండోడు గౌస్, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని, పెద్దఎత్తున మైనార్టీలు పార్టీలోకి చేరడమే నిదర్శనమన్నారు. స్థానిక వైసీపీ నాయకులు జగన్ మెప్పు కోసం టీడీపీపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వల్లి, మండల కార్యదర్శి తక్కెళ్ల షరీఫ్, యాసిన్, మహబూబ్ షరీఫ్, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్, సింగిల్ విండో చైర్మన్ రామాంజనేయ రెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, పుష్పనాథ్‌రెడ్డి, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

పశువుల తరలింపుపై కేసు నమోదు

- 82 పశువుల పట్టివేత

ఎర్రగుంట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రెండు కంటైనర్లలో అక్రమంగా 82 పశువులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి కేఏ 43 ఏ 1980 నెంబరు గల కంటైనర్‌లో శాంతారాం ఆర్ముగం, అబ్దుల్ అజీజ్ 41 పశువులను పెబ్బేరు నుంచి పుంగనూరుకు, మరో 41 పశువులను డబ్ల్యూబీ23 డీ4340 కంటైనర్‌లో ఆలీ అనే వ్యక్తి మైదుకూరు నుంచి అనంతపురానికి తీసుకెళుతున్నారు. ఇందులో 34ఎద్దులు, 38గేదెలు, 10దున్నపోతులున్నాయని, ఆవులు లేవని సీఐ తెలిపారు. శనివారం రాత్రి ఎస్‌ఐ నాగమురళి పశువైద్యుల ఆధ్వర్యంలో వీటిని బద్వేలులో పరిశీలించి వాటి సంరక్షణార్థం మైదుకూరులో మేత ఉన్న చోట ఉంచారు. ప్రివెన్స్ ఆఫ్ క్రూయాలిటి టు అనిమల్స్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లి, కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

చీరకు మంట అంటుకుని వృద్ధురాలి మృతి

పోరుమామిళ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకోవడంతో ఒళ్లంతా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ కోనేటి నాగమ్మ (72) మృతి చెందిందని ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని దాసరిపల్లె గ్రామానికి చెందిన కోనేటి నాగమ్మ శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చీరకు అంటుకుని వళ్లంతా గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం ఉదయం మృతి చెందిందని తెలిపారు. మృతురాలి మనవడు తులసి వెంకటనారాయణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పుష్పగిరిలో బ్రహ్మసూత్ర శివలింగాలు



గంగాధరేశ్వర స్వామి ఆలయం



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

వల్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన పుష్పగిరిలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ గాలిగోపురం పక్కనున్న గంగాధరేశ్వర స్వామి ఆలయంలోని శివలింగానికి, అలాగే శివాలపల్లెలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ శివలింగానికి బ్రహ్మసూత్రం ఉన్నట్లు తన పరిశోధనలో తేలిందని రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేశ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పురాతన శివాలయాల్లో శివలింగంపై నిలువు గీతలుంటాయన్నారు. ఇవి చాలా అత్యంత అరుదైనవని, అన్ని శివాలయాల్లోని శివలింగాలకు ఈ విధమైన గీతలుండవని వివరించారు. ఇలా శివలింగంపై గీతలుండడాన్ని బ్రహ్మసూత్రం అంటారని, బ్రహ్మసూత్రాలను వేదసూత్రాలని కూడా అంటారని తెలిపారు. బ్రహ్మసూత్రమంటే అంతిమ వాస్తవం, మోక్షమార్గం అనే అర్థాలున్నాయని, బ్రహ్మసూత్రాలపై ఆదిశంకరాచార్యులు అనేక వివరణలిచ్చారని వివరించారు. విముక్తి పొందిన ఆత్మకు, అంతర్గత జ్ఞానం, బలం ఉంటాయని, దుఃఖం నుంచి విముక్తి పొందుతారని బ్రహ్మసూత్రం వివరిస్తుందన్నారు. 555 బ్రహ్మసూత్రాలుయన్నారు. వెయ్యిసార్లు ఒక శివాలయానికి వెళ్తే ఎంత ఫలితం వస్తుందో ఒక్క బ్రహ్మసూత్ర శివలింగాన్ని దర్శిస్తే అంతే ఫలితం వస్తుందన్నారు. శివాలపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి బ్రహ్మసూత్రం మధ్యలో ఒక నిలువాటి స్థూపాకార గీతుంటే దానికి కొంచెం కిందగా పార్శ్వ భాగాల్లో వంపు తిరిగిన గీతలున్నాయని, అలాగే గంగాధరేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మ సూత్ర శివలింగం మధ్యలో స్థూపాకార గీతుంటే దానికి సమానంగా పార్శ్వ భాగాల్లో కోణీయ నిలువు రేఖలు, వాటికి కింది తలంలో వంపు తిరిగిన గీతలున్నాయన్నారు.

చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ అదుర్స్

ప్రారంభోత్సవంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ ఆర్. శ్రవణ్‌రాజ్‌రెడ్డి



చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ సెంటర్‌లో కాఫీ కొనుగోలు చేస్తున్న ఆర్.శ్రవణ్‌రాజ్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ రుచికి సాటి మరేదీలేదని ఏసీఏ - రాజారెడ్డి క్రికెట్ స్టేడియం చైర్మన్ ఆర్. శ్రవణ్‌రాజ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బిల్టప్ సమీపంలోని విజయ దుర్గాదేవి ఆలయం పక్కన ఏర్పాటు చేసిన చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ (సీ.ఎఫ్.సీ)సెంటర్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తోట అండ్ దేవనేని గ్రూపు వారు చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ యాజమాన్యంతో కలిసి ఉమ్మడిగా ప్రారంభించిన కెఫే సెంటర్‌తో ప్రజలకు స్వచ్ఛమైన కాఫీని అందించాలని సూచించారు. టీడీపీ సీనియర్ నేత బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి కాసింత విశ్రాంతి, రుచికరమైన కాఫీని అందించేందుకు చేసిన ఏర్పాటును ఆయన అభినందించారు. టీడీపీ నేత దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం పక్కనే ఏర్పాటు చేసిన చెన్నపట్నం ఫిల్టర్‌కాఫీ సెంటర్ ఆ తల్లి ఆశీస్సులతో దిన దిన అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కాఫీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన తోట చక్రధర్ (షార్ట్‌కట్ మెథడ్ చక్రిసార్) తోట క్రిష్ణసాయి, దేవనేని వెంకటేష్, దేవనేని జనార్ధన్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కర్నాటి అమర్నాథ్‌రెడ్డి, జిల్లా పోలీసు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఏఎస్ఐ యోగా రాయల్, బలిజ ఉద్యోగ సంఘం నేత ఆకులవీధి మస్తాన్ రాయల్, కదిరి కిరణ్ రాయల్, ప్రముఖ నటుడు తోట చక్రవర్తి, గుంటి నాగేంద్ర, బలిజ సంఘం నేతలు ముగ్గురాళ్ల అమరప్ప, దాసరి శివ, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

భగవద్గీత పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

కడప కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని టీటీడీ-హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ కోదండరామ స్వామి ఆలయంలో భగవద్గీతపై ఉపన్యాస విభాగంతో పాటుగా 14, 16వ అధ్యాయాల విభాగాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు ఆ ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపీ బాబు వెల్లడించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా చింతకుంట శివారెడ్డి, గంగనపల్లి వెంకటరమణ, ఎస్. మునికుమార్, స్రవంతి, ఏ.ఎస్. సత్యాంబ, కె.భాస్కర్‌శర్మ, వై. దామోదరమ్మ, కె. కృష్ణగీత వ్యవహరించారు. విజేతలకు నగదు బహుమతులతో పాటుఆ జ్ఞాపికలు, రామాయణ గ్రంథాలను ఆ ఆలయ చైర్మన్ వెంకటరెడ్డి చేతులమీదుగా అందజేశారు.

బతుకు పోరాటం..!



నగరంలో వర్షంలోనే వ్యాపారం సాగిస్తున్న దృశ్యం



మానవుని జీవితం ప్రతిరోజూ ఉదయం లేచిన ప్పటి నుంచి పడుకునే వరకు జరిగే జీవన పోరాటంలో భాగంగా చిరు వ్యాపారస్తులు ఎండన కా, వాననకా, పగలనకా, రేయనకా చేస్తున్న చిన్న చిన్న వ్యాపారాలు మానవుని జీవితం సాగేందుకు దోహదపడుతున్నాయి. ఈ విషయమై కడప నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారాలు చేస్తున్న వారిని కదలించగా తెచ్చుకున్న పచ్చిసరుకు పూర్తి గా పోతే ప్రశాంతంగా ఉంటామని, ఒక్కరోజు పెట్టినా వస్తువులకు డబ్బులు కూడా రావాలని ఆవేదనవ్యక్తం చేసిన విషయాలు కనిపిస్తున్నాయి.

ఫొటోలు..: స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



దిశ పోలీసుస్టేషన్ వద్ద బొప్పాయికాయల వ్యాపారం

నేడు రక్తదాన శిబిరం

కడప మారుతీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దూదేకుల హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు నగర పాత కలెక్టరేట్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మున్నూరు అక్బర్ వెల్లడించారు. రక్తదాతల సహకారంతో కార్య క్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

పీఎస్ హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీఎస్ హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని ఏపీపీఎస్ హెచ్‌ఎంల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం సీఐటీయూ కార్యాలయంలో పీఎస్ హెచ్‌ఎంల సమస్యలపై సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫోరం నాయకులు వరలక్ష్మి, నాగ రాజు, జిల్లా బాధ్యులు శ్యాంసుందర్, సుబ్బారెడ్డి మహిళా ప్రతినిధి సుమలత పాల్గొన్నారు.

మొబైల్ షాప్స్, టెక్నీషియన్స్ సంక్షేమమే లక్ష్యం

కడప క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కడప నగరంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో కడప మొబైల్స్‌టెక్నీషియన్ అసోసియేషన్ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సైబర్ క్రైం సీఐ మధుమల్లేశ్వరరెడ్డి, మొబైల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ హాజరయ్యారు. కడప మొబైల్స్ అసోసియేషన్ సంబంధించి ఐడీ కార్డులను గౌరవ అతిథులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం సైబర్ క్రైం సీఐ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఫయాజ్ అహ్మద్, రాష్ట్ర జాయింటు సెక్రటరీ జమీల్, ఉపాధ్యక్షుడు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

స్టాప్, వాష్ అండ్ గో



కడప క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పలు కూడళ్ల వద్ద స్టాప్ వాష్ అండ్ గో ..కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్లు, లారీలు, బస్సులు, వ్యాన్లు తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపారు. ఆదివారం నగరంలోని బ్లాక్‌స్పాట్ ఏరియాలు గుర్తించి అక్కడ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించారు.

ప్రొఫెసర్ ప్రియాంకకు డాక్టరేట్ ప్రదానం



సీకేదిన్నె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రియాంకకు హిందుస్థాన్ విశ్వవిద్యాలయం చెన్నై వారు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ కేఎస్‌ప్రసాద్ తెలిపారు. తమ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తూ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.గోపాలకృష్ణన్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాల ప్రొఫెసర్ లోకేశ్వర్‌రెడ్డి గైడెన్స్‌లో ఈ పరిశోధనను త్వరితగతిన పూర్తి చేయడం జరిగిందన్నారు. డాక్టరేట్ పొందిన ప్రియాంకను కేఎస్ఆర్ఎం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబులరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

మానవత్వానికి ప్రతిరూపం మానవతా



బాక్స్ వితరణ చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న మానవతామూర్తుల సమ్మేళనమే మానవతా ఆవిర్భావం అని మానవతా వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీకళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం నెలవారీ సమావేశం జరిగింది. సేవా విభాగం,ఆత్మీయ కమిటీ సభ్యులు, నైతిక విలువలు కమిటీ సభ్యులు సేవలు అనిర్వచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి వెంకటసుబ్బయ్య ,స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర, నగర అధ్యక్షుడు సాంబశివారెడ్డి, కేంద్ర కమిటీ డైరెక్టర్లు హాజరయ్యారు.

వితరణ..: జలతోటి భాస్కర్, స్వర్ణ, చిన్న సుబ్బమ్మల జ్ఞాపకార్థం మాసాపేటకు చెందిన శారదా నిలయం కాలేజీలో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్ స్వర్ణ మాధవి లత, సంధ్య, సురేంద్ర బాక్స్ వితరణగా ఇచ్చారు.

ఆశావర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

కమలాపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ కమలాపురం నియోజకవర్గం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పాయసంపల్లెకు చెందిన ఆర్.అనిత, చెన్నూరుకు చెందిన టి.అనసూయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గ ఆశావర్కర్స్ యూనియన్ మహాసభలు విజయవంతంగా ముగిశాయని, ఈ మహాసభల్లో నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగిందన్నారు.

బాలికల హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్సీ



గుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని బాకరాపురంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికలవసతి గృహాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం 7గంటలకు హాస్టల్‌కు వెళ్లారు. అక్కడున్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనం, పాలు, గుడ్లు తదితర వాటిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో విద్యార్థులకు అందించే గుడ్లను, పాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందించే గుడ్లు సరఫరాచేసే వారు మరీదరుణంగా చిన్నసైజు గుడ్లు అందిస్తున్నారని ఆయన ఏమిటని హాస్టల్ అధికారులను ప్రశ్నించారు. అలాగే పిల్లలకు అందించే పాలు మరీ నీళ్లలాగా ఉన్నాయని, ఇలా నాణ్యత లేకుండా విద్యార్థులకు అందించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులే

పులివెందుల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మట్టిలో మాణిక్యాలను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీకే వెంకటనాథరెడ్డి మార్గదర్శకత్వంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ ప్రతిభ నమూన పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్ కిషోర్, ఎంఈఓలు చంద్రశేఖర్‌రావు, రామానాయుడు, విశ్వనాథ రెడ్డి, రామకృష్ణయ్య, రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌టీఏ, పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ, ఏపీటీఎఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కడప నాగరాజుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమణ అన్నారు. ఆదివారం కడప నగరంలోని బీసీ భవన్‌లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల రాయలసీమ, నెల్లూరు ప్రాంతీయ సదస్సుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల సత్యనారాయణ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అనుబంధ రాష్ట్ర కమిటీ డిప్యూటీ సెక్రటరీ శ్రీరాములు, ఏఐటీయూసీ కడప జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

దిత్వా తుఫానుతో జాగ్రత్త

● కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను వల్ల రానున్న రెండు లేదా మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. అవసరం లేకుండా బయట తిరగవద్దన్నారు. నీటితో నిండిన రహదారులు, వంతెనలు దాటేందుకు ప్రయత్నించవద్దని, విద్యుత్ తీగలు, పోల్‌లు తాకరాదన్నారు. ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ సదుపాయాలను శుభ్రం చేసుకోవాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లరాదన్నారు. అలాగే నదులు, వాగులు పొంగి పొర్లే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల వద్దకు వెళ్లరాదన్నారు. పశువులను ఎత్తయిన ప్రదేశాలకు తరలించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పరికరాలు, స్విచ్‌బోర్డులు వినియోగించరాదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. భారీ వర్షాలకు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కంట్రోల్ రూము నెంబర్లు డయల్ 112కు ఫోను ద్వారా తెలపాలన్నారు. అలాగే కలెక్టరేట్ కంట్రోల్ రూము నెం.08562- 246344, ఆర్డీవో కార్యాలయం కడప 08562 - 295990 నంబర్లను సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ-ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాట తప్పదని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్, ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వరద సహాయానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ సిద్ధం



సీకేదిన్నె పోలీసు స్టేషన్‌లో సీఐతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

సీకేదిన్నె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరదసహాయక చర్యలు ఎదుర్కొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సిద్ధంగా ఉన్నట్లు చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. మండలంలోని ఏడు సచివాలయాల పరిధిలో సిబ్బందిని అందుబాటులో ఉంచి అనంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అదే విధంగా జె.కొత్తపల్లె, ఊటుకూరు, క్రిష్ణాపురం పాఠశాలలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్‌డీఆర్ బృందం మండలంలోని బుగ్గవంక ప్రాజెక్టు పరిసరాలను వివిధ వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఇన్‌స్పెక్టర్ మితిలేష్‌యాదవ్ ఆధ్వర్యంలో 30 మంది టెన్త్ ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని ప్రజలు ఎక్కడ ఎటువంటి అవసరం వచ్చినా వెంటనే సహాయక చర్యలకు సంప్రదించాలన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

పులివెందుల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పులివెందుల రూరల్ సీఐ రమణ ప్రజలకు సూచించారు. ఆదివారం రాత్రి తొండూరు మండలం మల్లేల గ్రామంలో పులివెందుల సీఐ రమణ, ఎస్ఐ ఘనమద్దిలేటి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు.

గండిక్షేత్రం..మనోహరం



తుఫాన్ కారణంగా గండి క్షేత్రం ఊటీని తలపిస్తోంది. గండికి వచ్చే భక్తులకు ఈ వాతావరణం ఎంతో వినోదాన్ని ఇస్తోంది. శేషాచల పర్వతాలు మంచుతో కప్పబడి ఆహ్లాదకరంగా కనిపిస్తుండడంతో భక్తులను కనువిందు చేశాయి. చల్లటి వాతావరణం, పచ్చని కొండలు ప్రవహించే పాపాఘ్ని భక్తులను ఆకట్టుకున్నాయి.ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.

చక్రాయపేట, ఆంధ్రజ్యోతి

వరి రైతుల్లో ఆందోళన

దువ్వూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరి రైతుల్లో తుఫాను ఆందోళన నెలకొంది. దిత్వా తుఫాను ప్రభావంతో ఆదివారం దువ్వూరు మండలంలో చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. కేసీ ఆయకట్టు పొలాల్లో వరి పంట ఎర్రబారింది. పైరు కోత దశకు చేరుకున్న నేపథ్యంలో తుఫాను భయం వేధిస్తోందని రైతులు అంటున్నారు.

రచయిత జింకాకు సన్మానం



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పరిషత్ హాలులో ఆదివారం నిర్వహించిన రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన మహాకవి సమ్మేళనంలో రచయిత జింకా సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. డల్లాస్ రాయలసీమ ఏరియా సౌజన్యంతో నిర్వహించిన కవి సమ్మేళనంలో రాయలసీమలో ప్రసిద్ధి చెందిన ప్రదేశాలపై 180 మంది కవులు పాల్గొని కవితాగానం చేశారు. ఈ సందర్భంగా కవులను శాలువా, మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జింకా సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రముఖ కవులు శాంతినారాయణ, బండి నారాయణస్వామి, ఏలూరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంటకు దుంపకుళ్లు



దువ్వూరు వద్ద బొబ్బడాల తెగుళ్లు సోకిన పసుపు తోట



దుంపకుళ్లుతో కొమ్ములులేని పసుపు మొక్క

- అయోమయంలో అన్నదాతలు
- అధిక వర్షాలతో కుంగిన పైరు
- నిన్న వరి, మొక్కజొన్న.. నేడు పసుపు పంటతో తప్పని కష్టాలు

దువ్వూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పసుపు పంటకు దుంపకుళ్ల తెగుళ్లసోకడంతో సాగు చేసిన రైతుల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. అధిక వర్షాలు పడడంతో తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే మెరుగైన దిగుబడులు అందవనే పరిస్థితులు కనపడుతుండడంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. వర్షాల కారణంగా ఎక్కువ నీరు నిలబడే పొలాల్లో బొబ్బడాల, కాడ తెగుళ్ల కనిపిస్తున్నాయి.

● దువ్వూరు మండలంలో విస్తృతంగా పసుపు పంట సాగు చేశారు. మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగుకు పూనుకున్నారు. సాగు చేసిన మొదట్లో మొక్కలు బాగా ఉండి తోటలు కంటికి ఇంపుగా కనపడ్డాయి. వర్షాలు అధికంగా పడిన నేపథ్యంలో తెగుళ్ల ప్రభావం కనపడుతోంది. కాడతెగుళ్ల ఆశించిందని రైతులు వాపోతున్నారు. ఈ కారణంగా ఆకులు ఎర్రబడడం, అవి వాడిపోవడం జరిగింది. తోటలను కాపాడుకునేందుకు విస్తృతంగా మందులను పిచికారి చేశారు. కార్తీక మాసంలో దుంపకుళ్ల తెగుళ్ల ఆశిస్తుందని ఆ సమయంలో అప్రమత్తంగా ఉండాలని అనుభవం ఉన్న రైతులు తెలుపుతున్నారు. చాలా చోట్ల ఈ తోటలకు దుంపకుళ్ల ఆశించింది. అలాంటి తోటల్లో భూమిలో పుట్టిన పసుపు రెమ్మలను పురుగు తొలచివేస్తోంది. దీని కారణంగా పసుపు కొమ్ములు హరించుకుపోతున్నాయి. ఇలాంటి తోటల్లో నామమాత్రపు దిగుబడులు మాత్రమే చేతికొస్తాయని రైతులు అంటున్నారు. మండలంలోని గుడిపాడు, క్రిష్ణంపల్లె, జిల్లేళ్ల, పెద్దజొన్నవరం, వెంకుపల్లె, మూడిండ్లపల్లె, మదిరేపల్లె, చిన్నసింగనపల్లి, దువ్వూరు, చల్లబసాయిపల్లె పొలాల్లో పసుపు పంట సాగైంది. ఈ పంట పెట్టేందుకు రైతులు పెద్ద మొత్తంలో పెట్టుబడుల కింద డబ్బులు వెచ్చించారు. తోటల పరిస్థితిని చూసి దిగులు పడుతున్నాయి. కాగా గతేడాది 700 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేయగా ప్రస్తుతం సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేశారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా భారీ వర్షాలు, గాలులు సంభవించే అవకాశం ఉన్నందున విద్యుత్ ప్రమాదాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ సూచించారు. ఆదివారం జమ్మలమడుగు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు, గాలులు ఎక్కువగా ఉన్నప్పుడు, నీటి నిలువ ఉన్న ప్రాంతాల్లో కరెంటు స్తంభాలను తాకరాదని, వాటి దగ్గరకు వెళ్లరాదని, ఇంటిలో తడిగా ఉన్న స్విచ్‌బోర్డులను తాకరాదని సూచించారు. రైతులు విద్యుత్ మోటార్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగెలు, కరెంటు లైన్లు తెగిపడినా, స్తంభాలు విరిగినా కంట్రోల్ రూముకు లేదా సంబంధిత లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమస్యల ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీం నంబరు 1902కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ప్రజల సౌకర్యార్థం భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని నాలుగు విద్యుత్ డివిజన్లలో నాలుగు కంట్రోల్ రూములు అదనంగా జిల్లా కేంద్రంగా ఒక కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకులు ఎస్టీ సాధన కోసం పోరాడాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

పోరుమామిళ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకులు ఎస్టీ రిజర్వేషన్ కోసం ఐక్యంగా పోరాడాలని ఎంవీఆర్‌ఎఫ్ నాయకులు బోయ పులి కొండన్న, ఉగ్ర నరసింహులు, బాల రంగయ్య, జోన్ అధికార ప్రతినిధి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని మదర్‌థెరిసా ఫౌండేషన్ హాలులో వాల్మీకి బోయల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, ప్యాపిలీ, నంద్యాల ప్రాంతాల నుంచే కాక పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల వాల్మీకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో 8 జిల్లాల్లో ఎస్టీలుగా 15 జిల్లాల్లో బీసీ-ఏలుగా వాల్మీకులు ఉన్నారన్నారు. 1956 వరకు ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను 56 తరువాత కొందరు పాలకులు వాల్మీకుల అభివృద్ధిని ఓర్వలేక విభజించారన్నారు. వాల్మీకి కార్పొరేషన్ కూడా నిధులు కేటాయించడంలేదన్నారు. వాల్మీకులంతా ఐక్యతగా ఉండి ఎస్టీ రిజర్వేషను సాధించుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర నాయకుడు బోయ పులి కొండన్న ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల అధ్యక్ష కార్యదర్శులను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత ఆంజనేయులు, రంగ సముద్రం సర్పంచ్ మదర్‌థెరిసా ఫౌండేషన్ చైర్మన్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల వాల్మీకులు పాల్గొన్నారు.

మైన్స్ సేఫ్టీలో ఎర్రగుంట్ల ఐసీయల్ ఫస్ట్



ప్రథమ బహుమతిని అందుకుంటున్న ఎర్రగుంట్ల ఐసీయల్ టీం

ఎర్రగుంట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మైన్స్ సేఫ్టీ విభాగంలో ఎర్రగుంట్ల ఐసీయల్ కర్మాగారానికి ప్రథమ బహుమతి లభించినట్లు అధికా రులు తెలిపారు. ఆదివారం కడపలో కడప కోటిరెడ్డి సర్కిల్ మైన్స్ సేఫ్టీ వీక్ అండ్ ప్రొడక్టివ్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో 40వ గనుల భద్ర తా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ రఘుపతిపెద్దిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ కిషోర్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా సిమెంట్స్ ఆధ్వర్యం లో ఎర్రగుంట్ల నిడుజువ్విలో ఉన్న లైమ్ స్టోన్స్‌కు వివిధ విభాగాల్లో ప్రథమ బహుమతి లభించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 31మైన్స్ వారు పాల్గొన్నారు. కార్యక్ర మం లో ఐసీయల్ వీపీ మారుముత్తు, అధికారులు రమేష్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో సీపీఐ జిల్లా స్థాయి వర్క్‌షాపు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద సంవత్సరాల వేడుకల్లో భాగంగా డిసెంబరు 11, 12, 13 తేదీల్లో ప్రొద్దుటూరులో జిల్లా వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ దేశ స్వాతంత్ర్య సమపార్జన కోసం ఏర్పడిన పార్టీ అన్నారు. ప్రొద్దుటూరులో జరిగే జిల్లాస్థాయి వర్క్‌షాపునకు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా ఇన్‌ఛార్జి హరినాథ్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామయ్య, సుబ్బరాయుడు, హరి, శివారెడ్డి, శ్రీను, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.



కాలువల్లో వ్యర్థాలు తొలగించండి

ప్రొద్దుటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను కారణంగా వర్షపు నీళ్ల కాలువల్లో పారకుండా వ్యర్థాలు ఎక్కడెక్కడ అడ్డుగావున్నాయో యుద్ధ ప్రాతిపదిన తొలగించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మున్సిపల్ ఈఈ శ్రీనివాసులును ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ సెక్రటరీలు ఇన్‌స్పెక్టర్లు మున్సిపల్ ఇంజనీర్లుతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ మెరుగు పరిచేందుకు త్వరలో 90 రోజుల ప్రణాళిక ద్వారా పట్టణంలో చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను వల్ల కురిసే వర్షంతో కాలువల్లో ఎక్కడా ప్రవాహం ఆగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఈ రాజేష్, ఏఈలు దస్తగిరి, సురేంద్ర, శానిటరీ సూపర్‌వైజర్ నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగర్లను అరెస్టు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. నెల్లూరులో గంజాయికి వ్యతిరేకంగా పోరాడిన సీపీఎం నాయకులు పెంచలయ్యను హత్యచేయడానికి నిరసనగా ఆదివారం పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. గంజాయి స్థావరాలపై సీపీఎం నాయకుడు పెంచలయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినందుకే ఆయనను దారుణంగా హత్య చేశారని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాల్మన్, చంటి, గురమ్మ, వసంతరావు, బాబు, విజయకుమారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదు

జమ్మలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైఎస్ కుటుంబాన్ని విమర్శించే అర్హత కూటమి నాయకులకు లేదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జమ్మలమడుగులో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ, పట్టణ కమిటీల నాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వైసీపీ నాయకులపై విమర్శలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైఎస్ కుటుంబంపై విమర్శలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు పొన్నపురెడ్డి శివారెడ్డి, గిరిధర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి వజ్రభాస్కర్, లొగిడి జయన్న, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, దన్నవాడ మహేశ్వరరెడ్డి, మహాలక్ష్మి, సింగరయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు కల్పించాలి

అట్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీ-ఏగా ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అట్లూరు మండలం ఆకుతోటపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగ ఉపాధిల్లో అవకాశాలు కల్పించాలన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం కార్పొరేషన్ పాలకవర్గాన్ని నియమించాలని డిమాండ్ చేశారు.

వడ్డెరలు ఐక్యతను చాటుకోవాలి



ప్రొద్దుటూరు , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వడ్డెరలు ఐక్య తను చాటుకోవాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భగత్ సింగ్‌కాలనీలో నూతనంగా నిర్మించిన వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంను వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ గండికోట వెంకటసుబ్బయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు బత్తుల జానకిరామ్, జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి నారాయణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వడ్డెర సంక్షేమ సంఘం నూతన కమిటీని ప్రకటించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా మంజుల రాజకుళాయప్ప, ప్రధాన కార్యదర్శిగా వల్లెపు శ్రీనివాసులు కోశాధికారిగా బండారు వెంకటరమణ ను ఏకగ్రీకంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు.కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చెల్లా వెంకటరాముడు, గౌరవాధ్యక్షుడు వడ్డే బాల పెద్దయ్య, సలహాదారు బత్తుల ఏకో నారాయణ మల్లెబోయిన వీర కుమార్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అంజనమ్మలు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వకుంటే ఆందోళన

పోరుమామిళ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) :పోరుమామిళ్ల చెరువు కింద ముంపునకు గురైన రైతుల పొలాలకు నష్టపరిహారం అందించకపోతే ఆందోళన తప్పదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, మండల రైతు సంఘం నాయకులు భైరవ ప్రసాద్, కల్లూరి రాజారెడ్డిలు అన్నారు. ఆదివారం చెర్లోపల్లె రెవెన్యూ గ్రామాల రైతు సదస్సు లో వారు మా ట్లాడుతూ పోరుమామిళ్ల చెరువునీటి ముంపునకు గురవుతున్న పది గ్రామాల పంట పొలాలను కాపాడాలనడం సాధ్యం కాని పక్షంలో న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోరుమామిళ్ల చెరువు కింద చెరుకూరు, టేకూరుపేట, తిరువంఎగలాపురం, నూరిసిద్దుపల్లె, దాసరిపల్లె, కవలకుంట్ల, తోకలపల్లె, కొరపాటిపల్లె తదతర గ్రామాల రైతుల పొలాలు నీట మునిగాయన్నారు.

ఆధునిక యుగకర్త గురజాడ అప్పారావు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య రంగంలో ఆధునిక యుగకర్త గురజాడ అప్పారావు అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను పురస్కరించుకుని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా సంఘ సంస్కరణలకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌బాబు, సుబ్బారెడ్డి, ఆంజనేయులు, కేరోజీ, షేక్షావలి, పద్మావీరన్న తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: గురజాడ అప్పారావు సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో ఆదివారం గురజాడ అప్పారావు వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ గురజాడ అత్యంత ప్రసిద్ధిచెందిన రచనలలో కన్యాశుల్కం నాటకం ఒకటన్నారు. అనంతరం ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో 60మంది వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు లైబ్రరీ సభ్యత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ అభివృద్ధి కమిటీ మిర్యాల శివగణపతి, డాక్టర్ పి.నరసింహులు, లక్ష్మీనారాయణ, దాదాఖలందర్, మధుశర్మ, గ్రంథాలయ అధికారి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విలువలతో నైతికత పాటించాలి



ఎంఈవోను సన్మానిస్తున్న మానవత సంస్థ

ఎర్రగుంట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సామాజిక విలువలతోపాటు నైతిక విలువలు ప్రతి ఒక్కరు పాటించాల్సిన అవశ్యకత ఉందని ఎంఈవో 2 రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎర్రగుంట్లలో జరిగిన మానవత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ విద్యార్థుల్లో రోజురోజుకు నైతిక విలువలు కొరవడుతున్నాయన్నారు. కొందరు విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఉపాధ్యాయుల చేతినుంచి పరిస్థితి దాటిపోతోందని ఆయన ఆవేన వ్యక్తం చేశారు. సరైన దారిలో పెట్టాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మానవత సంస్థ ద్వారా నైతిక విలువలు పెంపొందించే చర్యలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సంస్థ తరుపున ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి, డైరక్టర్ బోర్డు సభ్యులు మల్లికార్జునరెడ్డి, మేడారమేష్‌బాబు, డాక్టర్ రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

